సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 21 । మార్చి । 2025




అన్ని వర్గాలకు అనుకూలం

రాష్ట్ర బడ్జెట్ చరిత్రలో నిలిచిపోతుందని, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. - IIలో



పనులు ప్రారంభమయ్యేనా

జీబీనగర్ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ పనులకు శంకుస్థాపన చేసి 18 నెలలు గడిచినా పనుల్లో కదలిక లేదు. - IIIలో



న్యూస్‌రీల్

నేడు వాటర్‌షెడ్ యాత్ర



వాటర్‌షెడ్ ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

సంస్థాన్ నారాయణపురం : నీటి సంరక్షణ పనులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా అమలయ్యే వాటర్‌షెడ్ పనులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శుక్రవారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని పుట్టపాక, జనగాం గ్రామాల్లో వాటర్‌షెడ్ యాత్ర చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, వాటర్‌షెడ్ ఏర్పాటు ప్రతిపాదిత ప్రాంతాలను వారు పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, సత్యం తదితరులు ఉన్నారు.

'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో ప్రజాధనం ఆదా



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆలేరురూరల్ : రాష్ట్రాల్లో తరుచూ జరుగుతున్న ఎన్నికల వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఒకే దేశం ఒకే ఎన్నికతో ఆదా అవుతుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. 'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై గురువారం ఆలేరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యలయంలో ఆయన మాట్లాడారు. పలుమార్లు ఎన్నికలు జరగడం వల్ల సామన్యులు ఆర్థిక భారంతో పోటీ చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగితే మరింత పురోగతి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆలేరు మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోగ శ్రీనివాస్, మండల కన్వీనర్ బైరి మహేందర్, అమరేందర్, శంకర్, ప్రశాంత్, సుధగాని సురేష్, కంతి రవి, రాజు, వెంకటేష్, శ్రీను, కిషన్, సందీప్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఇందిర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన అర్చకులు.. శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు.

నేడు ఉపకరణాల పంపిణీ

భువనగిరి : జిల్లాలో గుర్తించిన దివ్యాంగులైన చిన్నారులకు శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు డీఈఓ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష, ఆర్టిఫీషియాల్ లింబ్స్ కార్పొరేషన్ ఇండియా సంయుక్తంగా గత సంవత్సరం ఆగస్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వైకల్య పరీక్షలు నిర్వహించి 159 మంది చిన్నారులను అర్హులుగా గుర్తించారు. భువనగిరిలోని బాగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు.

పరిశ్రమల్లో ప్రగతి

తలసరి ఆదాయంలోనూ టాపే..

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో మొదటి స్థానంలో నల్లగొండ
- లాంగెస్ట్ రోడ్ నెట్‌వర్క్‌లో రెండో స్థానం.. రేషన్ కార్డుల్లో నాలుగో స్థానం
- పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనలో ఐదో స్థానంలో యాదాద్రి

తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్-2025లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉంది. అన్ని కేటగిరీలో పరంగా చూసినా విద్యుత్ కనెక్షన్లలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. రోడ్ నెట్‌వర్క్‌లో నల్లగొండ జిల్లా రెండో స్థానంలో ఉండగా, టీఎస్ ఐపాస్ పరిశ్రమలు ఏర్పాటైన జిల్లాల్లో, అత్యధికంగా పరిశ్రమల ఏర్పాటు ద్వారా పెట్టుబడులను సాధించడమే కాకుండా పెద్ద ఎత్తున ఉపాధి కల్పించిన జిల్లాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. ఎగుమతుల్లోనూ ఆరో స్థానంలో నిలిచింది. ఇలా వివిధ రంగాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాష్ట్రంలో మెజారిటీ రంగాల్లో మెరుగైన స్థానంలో ఉంది. ఈ విషయాలను సామాజిక, ఆర్థిక ఔట్‌లుక్-2025లో ప్రభుత్వం వెల్లడించింది. అసెంబ్లీలో బుధవారం ప్రభుత్వం బడ్జెట్‌తోపాటు సామాజిక ఆర్థిక ఔట్‌లుక్‌ను ప్రవేశపెట్టింది.

తలసరి ఆదాయంలో యాదాద్రి ముందంజ



తలసరి ఆదాయంలో నల్లగొండ, సూర్యాపేటతో పోల్చితే యాదాద్రి జిల్లా ముందంజలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా తలసరి ఆదాయంలో యాదాద్రి జిల్లా 7వ స్థానంలో ఉండగా, నల్లగొండ జిల్లా 11వ స్థానంలో, సూర్యాపేట జిల్లా 16వ స్థానంలో ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో సగటున ప్రతి వ్యక్తి ఆదాయం రూ.2,88,599 కాగా, నల్లగొండలో రూ.2,76,273గా నమోదైంది. సూర్యాపేట జిల్లాలో 2,48,429గా ఉంది.



పరిశ్రమల ద్వారా యాదాద్రికి రూ.5598 కోట్ల పెట్టుబడులు

టీఎస్ ఐపాస్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి పరిశ్రమలు ఏర్పాటు చేసిన జిల్లాల్లో ఐదో స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా నిలువగా, నల్లగొండ 12వ స్థానంలో నిలిచింది. సూర్యాపేట 23వ స్థానంలో నిలిచింది. యాదాద్రి జిల్లాలో 1032 పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.5598 కోట్ల పెట్టుబడులు రాగా, 34,876 మందికి ఉపాధి లభించింది. నల్లగొండ జిల్లాలో 693 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.4344 కోట్ల పెట్టుబడులు రాగా, 17,220 మందికి ఉపాధి లభించింది. సూర్యాపేట జిల్లాలో 330 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.5207 కోట్ల పెట్టుబడులు లభించగా, 10,439 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

ఒక్క సంవత్సరంలోనే..


2024-25 ఆర్థిక సంవత్సరంలో యాదాద్రి జిల్లాలో 93 కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాగా రూ.222 కోట్ల పెట్టుబడులు వచ్చి 1666 మందికి ఉపాధి లభించింది. నల్లగొండలో 56 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.955 కోట్ల పెట్టుబడులు రాగా, 2053 మందికి ఉపాధి లభించింది. సూర్యాపేట జిల్లాలో 26 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.67 కోట్లు రాగా, 516 మందికి ఉపాధి లభించింది.

లాంగెస్ట్ రోడ్ నెట్‌వర్క్‌లో రెండో స్థానంలో నల్లగొండ

రాష్ట్రంలో అత్యధిక దూరం రోడ్ నెట్‌వర్క్ కలిగిన జిల్లాల్లో రంగారెడ్డి ప్రథమ స్థానంలో ఉండగా, నల్లగొండ జిల్లా రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,11,775.56 కిలోమీటర్ల రోడ్ నెట్‌వర్క్ ఉండగా, రంగారెడ్డిలో 7,932.14 కిలోమీటర్లు ఉంది. నల్లగొండలో 7,766.92 కిలోమీటర్లు ఉంది. కీలకమైన రోడ్డు డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో నల్లగొండను ఒకటిగా తీసుకుంది. లతీఫ్ సాహెబ్ గుట్ట – బ్రహ్మంగారిమఠం, శివాలయం వరకు రూ.140 ఘాట్ రోడ్డును నిర్మించబోతోంది. రూ.236 కోట్లతో యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ నుంచి నార్కట్‌పల్లి అద్దంకి హైవేకు లింక్ చేస్తూ సీసీరోడ్డు వేస్తోంది.

విద్యుత్ కనెక్షన్లలో టాప్

రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేని విధంగా నల్లగొండలోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అత్యధికంగా ఉన్నాయి. 2,37,664 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో మొదటి స్థానంలో నల్లగొండ ఉండగా, 1,54,224 కనెక్షన్లతో సూర్యాపేట నాలుగో స్థానంలో ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 1,17,477 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అన్ని కేటగిరీల విద్యుత్ కనెక్షన్ల పరంగా చూస్తే.. నల్లగొండ ఐదో స్థానంలో నిలిచింది. నల్లగొండలో మొత్తంగా 8,24,747 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, సూర్యాపేటలో 5,40,252, యాదాద్రి భువనగిరిలో 4,46,876 కనెక్షన్లు ఉన్నాయి.



పంటల సాంద్రతలో 136 శాతం


పంటల సాగు సాంద్రతలో ములుగు జిల్లా 293 శాతంతో మొదటిస్థానంలో నిలువగా, నల్లగొండ జిల్లా 136 శాతంగా నమోదైంది. సూర్యాపేట జిల్లాలో 160 శాతం ఉండగా, యాదాద్రి భువనగిరిలో 152 శాతంగా ఉంది. నల్లగొండ జిల్లాలోని జనాభా పరంగా ప్రతి వ్యక్తి చేతిలో సగటున 0.97 హెక్టార్ల భూమి ఉండగా, యాదాద్రి జిల్లా ఒక హెక్టార్, సూర్యాపేటలో 0.92 హెక్టార్ల భూమి ఉంది.

నల్లగొండలోనే అత్యధికంగా రేషన్ షాపులు

రేషన్ షాపులు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. ఏ జిల్లాలో లేని విధంగా నల్లగొండలో 997 షాపులు ఉండగా, 4,66,522 కార్డుదారులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 610 షాపులు ఉండగా, 3,25,235 కార్డుదారులు ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 515 షాపులు ఉండగా, 2,17,072 మంది కార్డుదారులు ఉన్నారు.



నల్లగొండలో పెన్షనర్లు ఎక్కువే..



రాష్ట్రంలో అత్యధికంగా పెన్షనర్లు ఉన్న జిల్లాల్లో నల్లగొండ నాలుగో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో హైదరాబాద్, ఆ తరువాత స్థానాల్లో నిజామాబాద్, జగిత్యాల, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. నల్లగొండలో 2,04,535 మంది పెన్షనర్లు ఉండగా, సూర్యాపేటలో 1,47,160 మంది, యాదాద్రిలో 1,00,401 మంది వృద్యాప్య, వికలాంగుల, వితంతు, చేనేత, గీత, బీడీ వర్కర్స్, ఒంటరి మహిళ తదితర పెన్షన్లను పొందుతున్నారు.

ఎగుమతుల్లో ఆరో స్థానంలో యాదాద్రి జిల్లా



సరుకుల ఎగుమతుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఆరో స్థానంలో నిలువగా, మెదక్ ఏడో స్థానంలో, నల్లగొండ 8వ స్థానంలో నిలిచింది. 41.42 శాతం ఎగుమతులతో మొదటి స్థానంలో రంగారెడ్డి, 17.60 శాతంతో రెండో స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నిలిచాయి. 15.42 శాతం ఎగుమతులతో సంగారెడ్డి మూడో స్థానంలో, 13.51 శాతంతో హైదరాబాద్ నాలుగో స్థానంలో, 2.82 శాతంతో మహబూబ్‌నగర్ ఐదో స్థానంలో నిలిచాయి. 2.04 శాతంతో యాదాద్రి భువనగిరి ఆరో స్థానంలో నిలువగా, 1.38 శాతంతో మెదక్ ఏడో స్థానంలో, 1.07 శాతం ఎగుమతులతో నల్లగొండ 8వ స్థానంలో నిలిచింది. రాష్ట్రం నుంచి అయ్యే ఎగుమతుల్లో ఈ జిల్లాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

టెన్త్ పరీక్షలకు అంతా సిద్ధం



భూదాన్‌పోచంపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న టీచర్లు

భువనగిరి : పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు ఉంటాయి. 50 కేంద్రాల్లో 8,632 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. సందేహాల నివృత్తికి సెల్ నంబర్ 90107 72080 ఏర్పాటు చేశారు. పరీక్షల కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరీక్షల రాష్ట్ర పరిశీలకులు రమణకుమార్ పరిశీలించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆమె వెంట డీఈఓ సత్యనారాయణ, ఏసీజీఈ రఘురాంరెడ్డి, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, సీఎస్, డీఓలు ఉన్నారు.

విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్



జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి : పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు కలెక్టర్ హనుమంతరావు ఆల్ ది బెస్ట్ చెప్పారు. కచ్చితంగా పాస్ అవుతామని పాజిటివ్ ఆలోచనతో పరీక్షలు రాయాలని, ఎలాంటి ఒత్తిడికి గురికావద్దని సూచించారు. అదే విధంగా డీఈఓ సత్యనారాయణతో కలిసి ఎంఈఓలు, సీఎస్, డీఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలన్నారు.

వర్షసూచన



భువనగిరిటౌన్ : జిల్లాలో ఈనెల 22న ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ గురువారం సూచించింది. 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. వడగళ్ల పడే అవకాశాలు ఉన్నాయని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులను చెట్ల కింద ఉంచరాదన్నారు. పంట చేలకు పురుగు మందుల పిచికారీని తాత్కాలికంగా ఆపాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న కూరగాయలను కోసుకోవాలన్నారు.

పరీక్ష ముగిసింది.. ఫలితం మిగిలింది



పరీక్ష ముగిసిన అనంతరం భువనగిరిలోని సెంటర్ వద్ద షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్న విద్యార్థినులు

భువనగిరి : ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిసాయి. చివరి రోజు జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, వాణిజ్యశాస్త్రం పరీక్షలకు 5,326 మంది విద్యార్థులకు గాను 5,152 మంది హాజరయ్యారు. 174 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రమణి తెలిపారు. పరీక్షలు ముగియడంతో పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు హుషారుగా కనిపించారు. రెండేళ్లు కలిసి చదువుకొని విడిపోతూ కొందరు బాధపడ్డారు. చివరగా సెల్ఫీలు దిగారు.

కేసీఆర్ లేకపోతే తెలంగాణే లేదు

- 14 ఏళ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రం సాధించారు
- బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగు నీరిచ్చాం
- ఇప్పుడు ఇక్కడ నీళ్ల మంత్రి ఉన్నా చుక్క నీరు తేలేకపోతుండు
- సూర్యాపేటలో జరిగిన సన్నాహక సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వరంగల్ సభకు భారీగా తరలిరావాలని పిలుపు



బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ తదితరులు

సూర్యాపేటటౌన్ : 'కేసీఆర్.. పార్టీ పెట్టి సునామీ సృష్టించారు... కేసీఆరే లేకపోతే తెలంగాణ లేదు.. ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న వారికి ఆ పదవులే రాకపోయేవి' అని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభ విజయవంతానికి గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, మరో వైపు చంద్రబాబు లాంటి వారి సవాళ్ల మధ్య కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం సాహసం చేసి పార్టీ పెట్టారన్నారు. 14 ఏళ్ల సుదీర్ఘపోరాటం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. కేసీఆర్ మోకాలు ఎత్తుకు కూడా సరిపోని వాళ్లు ఆయన గురించి అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.5లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే.. ఇప్పుడు ఇక్కడ నీళ్ల మంత్రి ఉన్నా చుక్కనీరు తేలేకపోతున్నారని, దీంతో పంటలు ఎండిపోయి రైతులు గోసపడుతున్నారన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం జరిగితే ఒక మంత్రి పోయి చాపల కూర చేయించుకొని తింటున్నాడని విమర్శించారు. స్పీకర్ పదవికి కుల, మత పట్టింపులు ఉండవని, స్పీకర్ పదవి అంటే బీఆర్‌ఎస్‌కు ఎంతో గౌరవమని, ప్రసాద్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో తమ పాత్ర కూడా ఉందన్నారు. శాసనసభ మన అందరిదీ అన్న జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేశారని, గాంధీభవన్ లెక్క సభను నడుపుతున్నారని అన్న అక్బరుద్దీన్ ఒవైసీ మీద చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఒక్కొక్క గ్రామం నుంచి బండ్లు కట్టుకుని తరలిరావాలని కోరారు. ఈ సభ చూస్తే కాంగ్రెస్, బీజేపీ గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలన్నారు. వరంగల్ బహిరంగ సభ తర్వాత వెంటనే సభ్యత్వ నమోదుతోపాటు గ్రామ మండల కమిటీలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలు చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ ఏడాదిని పోరాట నామ సంవత్సరంగా పిలుచుకుందామని అన్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న కేటీఆర్, జగదీష్‌రెడ్డి

దేశానికి కేసీఆరే దిక్సూచి: జగదీష్‌రెడ్డి

దేశానికి దిక్సూచిలా కేసీఆర్ నిలుస్తారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ వెనుకబాటును చూసి చలించి గులాబీ జెండా ఎత్తారని, ఒక్కడిగా బయలుదేరి నేడు సముద్రంలా మారారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో దేశం వెనుకబాటుకు గురవుతోందని, ఇక్కడ ఆయన శిష్యుడు రేవంత్ అదే బాటలో పయనిస్తున్నాడని ఆరోపించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, బొల్లం మల్లయ్య యాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కరరావు, రవీంద్రకుమార్, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ రాష్ట్ర స్థాయి పోటీలకు 10మంది ఎంపిక

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నిర్వహిస్తున్న 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' జిల్లా స్థాయి ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి చర్చా వేదికలో పాల్గొని ప్రతిభ కనబరిచిన 10 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి పాల్గొనగా.. న్యాయమూర్తులుగా పర్యావరణ వేత్త సురేష్ గుప్త, సామాజిక వేత్త దుశ్చర్ల సత్యనారాయణ, రిటైర్డ్ లెక్చరర్ విజయ్‌కుమార్, నెహ్రూ యువకేంద్రం జిల్లా యువ అధికారి ప్రవీణ్ సింగ్ శిరీష వ్యవహరించారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్, ఎన్‌సిసి కేరే టేకర్ సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటరెడ్డి, అనిల్ కుమార్, కోటయ్య, మల్లేశం, శివరాణి, సావిత్రి, శిరీష, అంకుశ్, వాసు, దినేష్, కొండా నాయక్ , విద్యార్థులు పాల్గొన్నారు .

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆలేరురూరల్ : జిల్లాలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం ఆలేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నమూనాను చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, నాణ్యతలో తేడా రావద్దని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులంతా సకాలంలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా వారికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. బేస్మెంట్ లెవల్ పూర్తయిన తరువాత రూ.లక్ష, పైకప్పుకు రూ.లక్ష, స్లాబ్‌కు రూ.2లక్షలు మొత్తం రూ.5లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఇల్లు మంజూరుకాని వారు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, హౌజింగ్ అధికారి శ్రీరాములు, తహసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని వలిగొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం కంచనపల్లి గ్రామ పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. తుర్కపల్లి మండలం బిలయ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కాపురం గ్రామానికి చెందిన గుగులోతు రాములు తక్కువ ధరకు రేషన్ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరించి నిల్వ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

యువతి అదృశ్యం

త్రిపురారం: నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు గురువారం నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మడం గ్రామానికి చెందిన కొప్పుల మంజు హైదరాబాద్‌లోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో మంజు తల్లి లక్ష్మమ్మ ఇంట్లో నిద్రించింది. ఆమె నిద్రలేచి చూసేసరికి మంజు కనిపించలేదు. చుట్టుపక్కల బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా మంజు ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం మంజు తండ్రి శ్రీనివాస్ నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు


గాయపడిన రవిశంకర్

నార్కట్‌పల్లి: బైక్‌పై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శిని గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ సమీపంలో జరిగింది. నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రవిశంకర్ గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు నల్లగొండ నుంచి ఎల్లారెడ్డిగూడేనికి బైక్‌పై వెళ్తుండగా.. మహాత్మాగాంధీ యూనివర్సిటీ సమీపంలో వెనుక నుంచి గుర్తుతెలియని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రవిశంకర్‌ను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..

అడ్డగూడూరు: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు శివారులో జరిగింది. చిర్రగూడూరు గ్రామానికి చెందిన బెల్లం సోమయ్య గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా.. కోటమర్తి గ్రామానికి చెందిన సతీష్ బైక్‌పై వెళ్తూ చిర్రగూడూరు గ్రామ శివారులో సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సోమయ్య కాలు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలం

- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అధిక కేటాయింపులు
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తిచేస్తాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ చరిత్రలో నిలిచిపోతుందని, బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్దపీట వేయగా అందులో నల్లగొండ జిల్లానే ముందుందన్నారు. గతంలో ధాన్యం దిగుమతిలో నల్లగొండ జిల్లా ముందుందని.. ఈసారి ఆయకట్టు సాగు పెరిగిందని, దీని ద్వారా దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. బ్రాహ్మణవెల్లెంలకు బడ్జెట్‌లో కేటాయింపులు రెండింతలు పెంచారన్నారు. కాల్వ పనులు పూర్తిచేసేందుకు రూ.37 కోట్లు విడుదల చేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులను సంతోషంగా ప్రారంభించామని, కానీ అనుకోని ప్రమాదం జరిగి 8 మంది చనిపోవడం బాధాకరమన్నారు. అయినప్పటికి ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని వాటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యకు బడ్జెట్‌లో రూ.11వేల కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలో 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. వృత్తి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నల్లగొండలో రూ.75 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

12వేల కి.మీ. మేర రోడ్ల నిర్మాణం..

ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.5099కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 12వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి వచ్చే నెల టెండర్లు పిలువబోతున్నామని మంత్రి తెలిపారు. నూతన హైకోర్టు భవనం, ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనం నిర్మిస్తున్నామన్నారు. రైతులకు రూ.2400 కోట్లు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం పేదలకు ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని, తాము ఆ ప్రభుత్వం కట్టిన ఇళ్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఇవ్వడంతో పాటు మరో 3500 ఇల్లు మంజూరు చేశామన్నారు. వేసవిలో శ్కా ఎకరం కూడా ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై ఎయిమ్స్‌లో వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, వైద్యులు

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఆరోగ్య సంరక్షణ నిపుణుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడానికి గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించి మాట్లాడారు. రోగుల ఆరోగ్య సంరక్షణ, ఆస్పత్రి నిర్వహణలో కమ్యూనికేషన్ నైపుణ్యాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల్లో ఒత్తిడి తగ్గించేలా వర్క్‌షాప్‌లో కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీన్ రాహుల్ నారంగ్, వైద్యులు జాన్ అశోక్, బిపిన్ వర్గీస్, ప్రొఫెసర్ రేణుకాదేవి, లత, మాలతీష్, సురేష్మనుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో చైతన్యమే లక్ష్యంగా రావిరాల రచనలు


రావిరాల బుచ్చయ్య రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

చిట్యాల: సమాజంలో చైతన్యం కల్గించటమే లక్ష్యంగా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన తొలి తరం కవి రావిరాల బుచ్చయ్య కవిత్వం, రచనలు సాగాయని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. దివంగత రావిరాల బుచ్చయ్య రచించిన చైతన్య బావుటా, విముక్తి పథంలో గ్రంథాలను హైదరాబాద్‌లోని మౌలాలి రైల్వే ఇనిస్టిట్యూట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రావిరాల బుచ్చయ్య కడదాక సైద్ధాంతిక నిబద్ధత కల్గిన కవిగా ఉన్నారన్నారు. తెలంగాణ సాహితీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి, పర్యావరణవేత్త ఎదుల్ల అంజిరెడ్డి, సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్, ప్రధాన కార్యదర్శి సాగర్ల సత్తయ్య, వట్టిమర్తి గ్రామ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్రా లవేందర్‌రెడ్డి, నర్రా భాస్కర్‌రెడ్డి, బూరుగు గోపికృష్ణ, రాజారామ్మోహన్‌రాయ్, డాక్టర్ రాపోలు రామకృష్ణ, రావిరాల బుచ్చయ్య కుటుంబ సభ్యులు రావిరాల సుమతి, సమత, మమత, కిషన్, రమాకాంత్, హారిక పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కృష్ణ (ఫైల్)

పెద్దవూర: చేపల చెరువు వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దవూర మండలం నాయినివానికుంటతండాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాయినివానికుంటతండాకు చెందిన రమావత్ కృష్ణ (36) తన వ్యవసాయ భూమిలో చేపల చెరువు తవ్వించి చేపలు పెంచుతున్నాడు. చేపల చెరువులో నీరు పెట్టడానికి గురువారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. విద్యుత్ మోటారు ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై చెరువులో పడిపోయాడు. ఎనిమిది గంటలైనా కృష్ణ ఇంటికి రాకపోవడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అతడి భార్య జ్యోతి చేపల చెరువు వద్దకు వెళ్లి చూడగా.. కృష్ణ తల నీటిలో మునిగి ఉండటంతో తండాలోని కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ ద్వారా విషయం చెప్పింది. తండావాసులు చెరువు వద్దకు చేరుకుని కృష్ణను బయటకు తీసి చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే కృష్ణ మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నాగార్జునసాగర్ డ్యాంను సందర్శించిన సీఈ


అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ అజయ్‌కుమార్ తదితరులు

నాగార్జునసాగర్: సాగర్ డ్యాం ఎడమ వైపున బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గడ్డి పూర్తిగా తగలబడింది. నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం నల్లగొండ జిల్లా చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, సాగర్ డ్యాం సర్కిల్ ఈఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, ఇంజనీర్లు అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాను నిలిపి వేశామని, లైన్లు కలిపితే ఏ మేరకు నష్టం జరిగిందో తెలుస్తుందన్నారు. సీసీ కెమెరాల కేబుల్స్ కాలిపోయాయని, తిరిగి కేబుల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

దొంగతనం కేసులో జైలు

రామగిరి(నల్లగొండ): దొంగతనం కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ మొదటి అదనపు స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి కె. సౌందర్య గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ మండలం రంగారెడ్డినగర్‌కు చెందిన పకీరు మణెమ్మ ఒంటరిగా నివాసముంటోంది. 2017 మార్చి 13వ తేదీ రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించేందుకు పక్కనే తన బంధువు పకీరు వెంకట్‌రెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడ పకీరు వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మణెమ్మ కలిసి ముచ్చటిస్తుండగా.. రాత్రి 9.30గంటల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన పులి కొండలు వారి ఇంటికి వచ్చి మంచినీరు కావాలని అడిగాడు. మంచినీరు తాగిన తర్వాత చాలాసేపు వరకు కొండలు వారితో ముచ్చటించి ఆ తర్వాత మణెమ్మ మెడలో ఉన్న 3 తులాల పుస్తెల తాడు లాక్కోని పారిపోయాడు. దీంతో బాధితురాలు నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ మోతీరామ్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి కె. సౌందర్య పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధురి వాదనలతో ఏకీభవించి నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నల్లగొండ: రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చిట్యాల రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. రామకృష్ణ తెలిపిన ప్రకారం.. సుమారు 45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి రామన్నపేట వైపు రైలులో వస్తూ చిట్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. నల్లగొండ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 58595 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వ్యాపారంలో నష్టం.. 'రియల్' వ్యాపారి ఆత్మహత్య


సుబ్బారావు (ఫైల్)

హుజూర్‌నగర్: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురైన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలో జరిగింది. గురువారం స్థానిక ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నిమిషకవి సుబ్బారావు(45) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో సుబ్బారావు భార్య ఉమామహేశ్వరి నిద్ర లేచి చూసేసరికి భర్త కనిపించలేదు. దీంతో అతడి కోసం చుట్టుపక్కల మొత్తం వెతికింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో వారి ఇంటి పైకి వెళ్లి చూడగా స్లాబ్ ఎలివేషన్‌కి చున్నీతో సుబ్బారావు ఉరేసుకుని కనిపించాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపం చెందిన తన భర్త సుబ్బారావు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఉమామహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్కాన్ చెయ్.. కల్లు తాగెయ్..!

ప్రస్తుతం ఏ వస్తువు కొన్నా డిజిటల్ చెల్లింపులు తప్పని పరిస్థితిగా మారింది. డిజిటల్ చెల్లింపులను దృష్టిలో పెట్టుకుని శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన నిమ్మల రాములు అనే కల్లుగీత కార్మికుడు తన కల్లు అడ్డా వద్ద ఫోన్‌పే స్కానర్‌ను ఏర్పాటు చేసుకొని కల్లు విక్రయిస్తున్నాడు. కల్లు తాగేందుకు వచ్చేవారిలో ఎక్కువ మంది.. ఫోన్‌పే, గూగుల్‌పే ఉందా అని అడుగుతున్నారని, అవేవీ నా వద్ద లేవని చెప్పడంతో కల్లు గిరాకీ దెబ్బతింటుందని, దీంతో స్కానర్‌ను ఏర్పాటు చేసుకున్నానని రాములు చెప్పాడు.

– శాలిగౌరారం

బోరు మోటార్లు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ మధు

గుర్రంపోడు: వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, కరెంట్ తీగలను చోరీ చేస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను గుర్రంపోడు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఎస్ఐ పసుపులేటి మధు నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. గుర్రంపోడు మండలం చామలేడు గ్రామానికి చెందిన దోటి సైదులు, దోటి శంకర్, దోటి అశోక్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల వీరు గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లు, కరెంట్ తీగలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం ఆరెగూడెం బస్ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. సైదులు, శంకర్, అశోక్ కలిసి బైక్‌పై కరెంట్ తీగలు తీసుకుని వెళ్తుండగా.. వారిపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి నాలుగు మోటార్లు, 80 మీటర్ల మోటారు కేబుల్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వివాహిత బలవన్మరణం

చౌటుప్పల్ : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన స్వప్న(28)కి తంగడపల్లి గ్రామానికి చెందిన బుగ్గపట్ల మహేష్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. మహేష్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. స్వప్న ఇంట్లోనే ఉంటోంది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో స్వప్న మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. డ్యూటీ ముగించుకుని మహేష్ మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి స్వప్న ఉరేసుకుని కనిపించింది. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

దొంగ అరెస్ట్

రామగిరి (నల్లగొండ): చోరీలకు పాల్పడుతున్న దొంగను నల్లగొండ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి గురువారం విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో చర్లపల్లి సెంటర్‌లో రూరల్ పోలీసులు గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. స్కూటీపై అనుమానస్పదంగా వెళ్తున్న బత్తుల విజయ్‌చందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్న అంగీకరించాడు. అతడి వద్ద నుంచి 5తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- నిందితుడి అరెస్ట్

కోదాడరూరల్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన నిందితుడిని గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండకు చెందిన దాసరి జయసూర్య 2022లో భవానీనగర్‌కు చెందిన మణిమహర్షికి పరిచయమయ్యాడు. విద్యుత్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్నతస్థాయి అధికారులు తనకు తెలుసని మణిమహర్షిని జయసూర్య నమ్మించి అతడి వద్ద పలు దఫాలుగా రూ.14.50లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకొని రెండేళ్లు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన మణిమహర్షి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జయసూర్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ కె. శివశంకర్ తెలిపారు. సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం జిల్లాలోని రూ.2కోట్లకు పైగా డబ్బులు వసూళ్లు చేసిన దందాలో జయసూర్యతో పాటు పలువురు ఉన్నట్లు తెలిసింది.

వేసవిలో ఆకుకూరల సాగు- మెళకువలు

పాడి-పంట

నడిగూడెం: ఆకుకూరల్లో మానవ శరీరానికి అవసరమైన ఎన్నో పోషక పదార్థాలు లభిస్తాయి. ప్రతిరోజు ఆహారంలో ఆకుకూరలను తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వేసవిలో ఆకుకూరలు సాగుచేస్తే లాభాలు బాగుంటాయని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు.

- వేసవిలో సాధారణంగా అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. వేడిగాలుల వలన భూమిలోని తేమ ఆవిరై మొక్కలు వాడిపోతాయి. ఒకవేళ నీరున్నా విద్యుత్ కొరత, లోఓల్టేజీ సమస్యల వలన కూడా నీటిని సక్రమంగా అందించలేకపోవచ్చు. అయితే కొద్దిపాటి మెళకువలు పాటించి వేసవి ఆకు కూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. వేసవిలో సాగునీటి సమస్య ఉంటుంది కాబట్టి తేమ నిలుపుకోగల్గిన బరువైన నల్ల భూములు ఆకుకూరల సాగుకు అనుకూలంగా ఉంటాయి. నీటి వసతి ఉంటే ఎర్రనేలలు, ఇసుక నేలలు ఎంపిక చేసుకోవాలి. ఆకుకూర మడులకు తుంపర్ల పద్ధతిలో నీటిని అందిస్తే ఎండ తీవ్రత నుంచి ఆకుకూరలను కాపాడి అధిక దిగుబడులు సాధించవచ్చు.

అనువైన రకాలు : వేసవి సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, అనువైనవి.
తోటకూర : ఆర్.ఎస్.ఎ-1, అర్కాసుగుణ, పూసాకీర్తి, అర్కఅరుణ, ఎరుపు,
పాలకూర : ఆల్‌గ్రీన్, పూసా జ్యోతి, పూసాపాలక్,
మెంతికూర : పూసా ఎర్లీబంచింగ్, లాంసెలక్షన్-1,
కొత్తిమీర : సాధన ,స్వాతి,


నడిగూడెం: కరివిరాలలో సాగవుతున్న పాలకూర

గోంగూర : ఆంగ్రో-12, లోకల్, ఎర్ర గోంగూర రకాలను ఎంపిక చేసుకోవచ్చు.

విత్తే విధానం :
తోటకూర : 900-1000 గ్రాముల విత్తనం 10కిలోల ఇసుకతో కలిపి ఒత్తుగా చల్లాలి. ఎకరాకు 20కిలోల నత్రజని, 20కిలోల భాస్వరం, 20కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. కోత, కత్తిరింపు తర్వాత ఎకరాకు 10కిలోల నత్రజని అందించే ఎరువును వేసి నీరుపెట్టాలి.
పాలకూర : ఎకరాకు 12-15కిలోల విత్తనం, వరుసకు వరుసకు మధ్యన 12సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 10సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 10కిలోల నత్రజని, 10కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి.
మెంతికూర : ఇసుక, మురుగు నీటి వసతి ఉన్న ఒండ్రు నేలలు మెంతికూర పండించేందుకు అనుకూలం. 10-12కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని వెదజల్లవచ్చు లేదా వరుసలలో నాటవచ్చు. విత్తే ముందు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వెదజల్లాలి. ఎకరాకు 10కిలోల నత్రజని, 20కిలోల భాస్వరం, 20కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.
కొత్తిమీర : మురుగు నీటి సౌకర్యం కలిగిన బంకనేలలు అనుకూలం. విత్తే ముందు గింజలను రెండు బద్దలుగా చేయాలి. విత్తనాన్ని వెదజల్లడం లేదా వరుసలలో వేయాలి. ఎకరాకు 5-6కిలోల విత్తనాన్ని 15సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 4కిలోల నత్రజని, 10కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేయాలి.

ఎరువుల యాజమాన్యం : బాగా దుక్కి చేసిన నేలలో ఆఖరి దుక్కిలో ఎకరాకు 10-15 టన్నుల పశువుల ఎరువు 200 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాటితో పాటు జీవన ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువులు వాడకం వలన నేల గుల్లబారి ఎక్కువ రోజులు తేమ నిల్వ ఉంటుంది. రెండు వరుసల మధ్య వరిగడ్డి, వేరుశనగ పొట్టు ఎండుటాకులు పరిస్తే నేలలో తేమ సంరక్షించబడును. ఆకు దిగుబడి పెంచడానికి 2శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి) జిబ్బరెల్లిక్ ఆమ్లం 50మి.గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల ఆకుకూరల్లో ఆకు దిగుబడి పెరుగుతుంది. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

కలుపు నివారణ : అన్ని ఆకుకూరల పంటల్లో కలుపు నివారణకు పెండిమిథాలిన్ ఎకరాకు 1.2 లీటర్లు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 14 గంటల్లో పిచికారీ చేసి, 30 రోజుల వరకు కలుపు నివారించవచ్చు.
సస్యరక్షణ : ఆకుకూరలను కూరగా వాడతారు కనుక వీలైనంత వరకు పురుగు మందులను వాడకపోవడమే మంచింది. వేప సంబంధిత పురుగు మందులను మాత్రమే వాడాలి. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పురుగుల నివారణకు మలాథియాన్ 2మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బెండాజిమ్ 1గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

గోంగూర : ఎకరాకు 6-8కిలోల విత్తనాన్ని 60సెం.మీ. ఎడంగా తయారు చేసుకున్న బోదెలో 30సెం.మీ. దూరంలో వరుసలో విత్తుకోవాలి. ఎకరాకు 6కిలోల నత్రజని, 8కిలోల భాస్వరం, 8కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి.
నీటి యాజమాన్యం : ఆకుకూర విత్తనాలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మళ్లీ మూడోరోజు నీరు పెట్టి నేల స్వభావాన్ని బట్టి తేలిక నేలలో 5-6 రోజుల వ్యవధిలో, బరువు నేలలో 8-10 రోజులకు ఒకసారి నీటి తడి వ్వాలి. తోటకూర విత్తిన తర్వాత నెమ్మదిగా నీటిని పారించాలి. లేకపోతే నీటితో విత్తనం కొట్టుకపోయి మొలకశాతం తగ్గుతుంది. ఆకుకూరల్లో దిగుబడి ముఖ్యంగా వేసవిలో నీటి యాజమాన్యంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతి కోత తర్వాత పైపాటు ఎరువులు చల్లి నీరు పెట్టాలి.